# ఆబ్దికం

రమణమూర్తి ఇల్లంతా చుట్టాలతో గందరగోళంగా వుంది

ఇంటితో పాటు అతని మనసు కూడా అలాగే చిందరవందరగా వుంది కారణం, ఏడేళ్ళ క్రితం పరలోక పావనం చేసిన తండ్రి వీరనరసింహావతారంగారి ఆబ్దికం మరో రెండు రోజుల్లో జరపబోవడమే!

ఆయన పోయిన రెండు సంవత్సరాలు ఆ కార్యక్రమాన్ని ద్విగుణీకృతోత్సాహంతో, సాధ్యమైనంత ఎక్కువగా ఖర్చు పెట్టి బంధువుల చేత సెహబాస్ అనిపించుకున్నాడు కాని గత మూడు నాలుగు సంవత్సరాలు నుంచి కాస్త వెనకడుగు వేసినా ఫర్వాలేదనిపించేలా చేశాడు

కానీ పెరుగుతున్న సంసారం, చాలీచాలని జీతం, ఎప్పుడూ ఏదో ఒక తప్పనిసరి ఖర్చులతో సతమతమవుతున్న రమణమూర్తి ఈసారి తండ్రి సంవత్సరీకాన్ని నిర్వహించటం అసాధ్యంగా తోచింది అయినా ఒక్కగానొక్క కొడుకు కావటం వల్ల ఆ వంశంలో అదో ఉన్నత సాంప్రదాయం అనటం చేతా, ఏదో తిప్పలు పడి ఈసారికి ఎలాగో పూర్తి చేయాలని సంకల్పించి ప్రయత్నాలు ప్రారంభించాడు

ప్రతి సంవత్సరమూ వస్తున్న చుట్టరికాల సంఖ్య, ఈ సారి తగ్గించాలనుకుని కూడా మొహమాటానికి పోయి, మాటపడవలసి వస్తుందన్న భయం వల్ల నలుగురక్క చెల్లెళ్ళతో పాటు, ముఖ్యమైన బంధువుల్ని కూడా ఉత్తరాలు రాస పిలిపించక తప్పలేదు

దాదాపు పదిహేను మంది వరకూ బయటి వూళ్ళ నుంచి రెండు రోజులు ముందుగానే వచ్చారు ముందుగా రావటమే కాదు, కార్యక్రమం అయ్యాక కూడ రెండు రోజులుండి మరణించిన వారి జ్ఞాపకాలను మననం చేసుకుంటూ, ఆయన గొప్పతనాన్ని శ్లాఘిస్తూ అప్పుడు కానీ బండి ఎక్కరు,

ఆబ్దికానికి అయ్యే ఖర్చు తక్కువే అయినా, ఈ బంధువర్గాన్ని అన్నిరోజులూ మేపటానికి ఎన్నో రెట్లు ఎక్కువ ఖర్చు అవుతుంది

ఈ విషయంలో రమణమూర్తి భార్య అతనితో పోరాడి విఫలమైంది

కొంతకాలం పోయిన తర్వాత గానీ భార్య మాటలు తలకెక్కలేదు అయినా భయం తండ్రి ఆబ్దికం కోసం ఖర్చుకి వెనుకాడే స్థితికి రమణమూర్తి చేరాడని అందరూ అనుకుంటారనే వెరపు చేత ఈ సారికి ఎలాగో పూర్తి చేసి తర్వాత సంవత్సరం వీలయితే చేయటం లేకపోతే మానివేయటం చేయవచ్చని నిర్ణయించుకున్నాడు

మొదట్లో అయితే ఈ కార్యక్రమాన్ని ఐదు రోజుల పాటు నిర్విఘ్నంగా నిర్వహించి మొత్తం పది రోజులు బంధువుల్ని విడిది చేయించేవాడు

ఆ రోజులు వేరు ఇప్పటిలా ధరలు మండిపోలేదు. అదిగాక చేతిలో కట్నం డబ్బులూ అవీ పదివేలు వుండటం వల్ల ధైర్యంగా వుండేది పైగా బాబాయిలూ, మామయ్యలూ తలా ఒక చేయి వేసి తృప్తిపడేవారు

ఇప్పుడా తృప్తి పడటాలూ, పుణ్యాలూ అంటూ వాటి జోలికి పోక వచ్చి తినేసి వెళ్ళిపోవటం మామూలైపోయింది

రమణమూర్తి ఆఫీసుకివారం రోజులు శెలవు పెట్టాడు.

అతని లీవ్ గ్రాంట్ చేస్తూ అన్నాడు వాళ్ళాఫీసరు, "ఈ రోజుల్లో కూడా ఇంత చాదస్తం ఏమిటోయ్ రమణమూర్తి ఏదో సింపిల్‌గా ముగ్గురు సన్యాసుల్ని పిలిచి భోజనం పెట్టి పంపే దానికి ఇంత ఆర్భాటం ఏమిటి? మేం అందరం చేయడంలా!" అంటూ మందలించాడు

రమణమూర్తి మౌనంగా చూసి బైటకొచ్చేశాడు.

పి ఎఫ్ పెట్టి, క్లర్కుకి ఓ వంద రూపాయలు ఆశ



చూపించి పదిహేను వంటలు శాక్షన్ చేయించుకున్నాడు

బియ్యం, పప్పులు, వుప్పులు కొని ఇంట్లో పడేశాడు పాత్ర సామాను అవీ ఆర్డర్ చేస అడ్వాన్సులు ఇచ్చాడు

ఆబ్దికం నిర్వహణ కోసం పంతులు గారిని కూడా మాట్లాడి అడ్వాన్సు ఇచ్చి వచ్చాడు

ఇంట్లో చుట్టాలతో అతని భార్య మహలక్ష్మ చాలా బిజీగా వుంది చుట్టాలందరికి టిఫన్లూ, కాఫీలు భోజనాల ఏర్పాట్లు చూడటంతో నే గంటలు నిముషాల్లా గడిచిపోతున్నాయి డబ్బు మంచి నీళ్ళులా ఎలా ఖర్చయిపోతూంది ఆమె పట్టించుకోడం లేదు

పట్టించుకుని పోరినా తన నాధుని చెవికెక్కదని ఆమెకి బాగా తెలుసు

ఆబ్దికం రోజున మరింత హడావిడి! ఆరేళ్ళ క్రితం చనిపోయిన నరసింహావతారంగారి గురించి, వారి జ్ఞాపకాలను తరచి తరచి చెప్పుకోసాగారు కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూండగా చనిపోయిన మనిషి మంచితనం సేవాతత్పరతల గురించి ఇలా ఎవరికి తోచినట్టు వాళ్ళు ముచ్చటించుకుంటున్నారు

రమణమూర్తి తల్లి మనసులోని ఆవేదనని నీటి ధారగా కురిపిస్తుంది కళ్ళ వెంట

ఉదయం ఏడున్నరయిపోయింది రమణమూర్తి బాబాయి, మామయ్య కావల్సిన సామాన్లన్నీ రెడి చేస కృష్ణాతీరానికి బయలుదేరటానికి సిద్ధంగా వున్నారు రమణమూర్తికి ఇదంతా అలవాటయిపోయిన చర్యే! అయినా అతని మనసు అదోలా వెలితిగా వుంది ఎవరూ చూడకుండా పెరట్లోకి వెళ్ళి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు

పంతులుగారు ఇంకా రాలేదు పెరట్లో వంటలు చేస్తున్న ఆడవాళ్ళ హడావిడ జాస్తిగా వుంది

రమణమూర్తి మామగారు పంతులుగారి రాక కోసం వీది గుమ్మంలో అరుగుమీద కూర్చుని, ఐదు నిముషాల కోసారి పంతులుగార్ని తిట్టుకుంటున్నాడు

చూస్తుండగానే పదిన్నరయి పోయింది రమణమూర్తికి కంగారుగా వుంది ఏం చేయాలో తోచటం లేదు

'ఒరేయ్‌మూర్తి! ఓ పక్కన భోజనాల వేళవు తూంది ఎక్కడ పనులక్కడే తగులడ్డాయ్! మనం కృష్ణానదికి వెళ్ళిపోయి అక్కడే ఎవరో ఒకర్ని చూసుకుందాం పదండి అంటూ అతని బాబాయి బయిట కొచ్చి నిలబడ్డాడు

ఇంతలో ఓ చిన్న కుర్రాడు సైకిలేసుకొచ్చి గుమ్మం ముందు దిగాడు

"మా నాన్న మీకు మంత్రానికి వస్తానన్నాట్ట కదండీ! ఆయనకి ఒంట్లో కులాసాగా లేదు మరెవరినైనా మాట్లాడుకోమని చెప్పమన్నాడు' అంటూ వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు.

రమణమూర్తి ఉస్సురన్నాడు ఈ సమయంలో ఉన్నట్టుండి ఎవరు దొరుకుతారు" అంటూ బాబాయి వైపు చూశాడు నిస్సహాయంగా

'నీకెందుకు నువు పదరా మూర్తి! కృష్ణ ఒడ్డున బోలెడంత మంది! పద పద అంటూ హడావిడి పెట్టాడు

అరగంట తర్వాత మగవాళ్ళంతా కృష్ణా తీరానికి చేరారు నలుగు రైదుగురు పంతుళ్ళు "ఆబ్దికం దివ్యంగా పెట్టిస్తాం అంటూ వీళ్ళని చుట్టుముట్టారు

అది చూసి రమణమూర్తి బాబాయి తన మాట నిజమైందన్నట్టు విజయ గర్వంతో చూశాడు అతన్ని.

వారిలో ఓ పండితుడు కాస్త ముందుకొచ్చి, "ఓ, రమణమూర్తి గారా! రండ్రండి మీ తండ్రిగారు పోయి అప్పుడే ఏడేళ్ళు దాటాయన్నమాట. మహానుభావుడు .. మనిషి కనిపిస్తే ఎంత ఆత్మీయంగా పలకరించేవారూ!" ఆయన ఆబ్దికం నేను జరిపిస్తాను పదండి' అంటూ ఇసుకలో అడుగులు ఒత్తి వేస్తూ నది ఒడ్డుకు దారి తీశాడు.

మంత్రముగ్ధుల్లా అందరూ అతన్ని అనుసరించారు

పంతులుగారి సలహామీద అందరూ గబగబా నదిలో దిగి తలారాస్నానం చేసి, తడి బట్టలతో వచ్చి కూర్చున్నారు

పంతులుగారు సంచుల్లోంచి, బట్టల్లోంచి పొట్లాలు తీసి విప్పి పరిచి పెట్టాడు.

"ఈ రోజుల్లో పిండ ప్రదానాలూ, తర్పణాలు ఎవరు చేస్తున్నారు చెప్పండి! అంతా వేగమయం అయిపోయింది పోయేవాళ్ళ కంటే పుట్టే వాళ్ళే ఎక్కువ' అంటూ బియ్యం పిండిని పెద్ద సైజు ఉండలు చేశాడు

'పితృదేవతల ఆత్మశాంత్యార్థ్యం సమర్పయామి...' అంటూ 'పెద్ద మనసుతో సద్బ్రాహ్మణుడికి బంగారం, వెండి, భూమి, గోదానం, రొఖ్ఖం, ధాన్యాలు ఒహటేమిటి ఎన్నెన్నో సమర్పించుకునే వారట పూర్వకాలంలో! హుం, రోజులు మారిపోయి ఒక్క నీటి బొట్టుతో సమస్తం సమర్పయామి' అనుకోవటం అలవాటు చేసుకోవల్సి వస్తుంది" అంటూనే కార్యక్రమం జరిపిస్తున్నాడు

'ఆఁ, నాయనా! రమణమూర్తి! తడిపంచెతో అలా ఈ ముగ్గు దగ్గర కూర్చుని, ఆ కండువా భుజం మీదుగా ముందుకి వేసుకో . అదీ" అన్నాడు

మిగతా వాళ్ళంతా కాస్త దూరంగా కూర్చుని చూస్తున్నారి కార్యక్రమాన్ని

కానీ రమణమూర్తి మాత్రం విస్మయంతో చూస్తున్నాడు పంతుల్ని. అతన్ని ఇదివరకెక్కడో చూసినట్లనిపిస్తుంది అలా ఆలోచిస్తూనే అతను చెప్పినట్లు పనులన్నీ నిర్వహిస్తున్నాడు యాంత్రికంగా!

ఆఁ, ఇదిగో ఈ దర్భ ఉంగరాన్ని వేళ్ళకు పెట్టుకో" అంటూ దర్భలను రింగులుగా చుట్టి ఇచ్చాడు

పునర్వ్యుత్పత్తిః ప్రేతి భావః మృతక్కస స్వర్గో నాపవర్గోవా ఇదిగో ఈ చెంబులో నీళ్ళు, ఈ పిండాల మీద చల్లి మూడు సార్లు తీర్థం పుచ్చుకో. నైవాత్మా పార లౌకికః, బుద్ధి పౌరుష హీనానాం, జీవికాదాతృ నిర్మితాః. . నీ తండ్రి పేరు?" అని అడిగాడు

చెప్పాడు రమణమూర్తి

ఆ తర్వాత తాత, ముత్తాతల పేర్లు కూడా చెప్పించుకుని వారి పేర్ల మీద మంత్రాలు చదివి పిండాల మీద నీళ్ళు తమలపాకుతో వదలమన్నాడు అతన్ని.

రమణమూర్తి మనసు మాత్రం పంతులుగారి మీదే వుంది

"సర్వేబ్రహ్మ, వదిష్యంతి... సంప్రాప్తేతు కలౌయుగే, నైవష్యంతి మైత్రేయ... శిశ్నాంబర పరాయణా –

ఆఁ, మీ తండ్రిగారి ఆత్మ నీ చుట్టూ, నీవాళ్ళ చుట్టూ పరిభ్రమిస్తూ... మీ, కుటుంబానికి మేలు జరగాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ మీకు మంచి జరిగేట్లు చేయుగాక' అంటూ పిండపు ముద్దను దోసిట్లోకి తీసుకోమన్నాడు రమణమూర్తిని.

ఆ తర్వాత దాన్ని నాలుగడుగులు ముందుకేసి ... ఇసుకమీద విస్తరిలో పెట్టమన్నాడు.

రమణమూ[illegible] అలానే చేశాడు. అందాకా ధూరంగా నిలబడి ని[illegible]క్కి చూస్తున్న కాకులు విసురుగా వచ్చి పిండపు[illegible]ద పక్కన వాలి ముక్కుతో పొడవసాగాయి.

రమణమూర్తి కళ్ళల్లో నీళ్ళు [illegible]యి



వక్కలంక పద్మావతి

ఒక్కసారి తండ్రి తలపుకు వచ్చి గుండె బరువెక్కింది

అతని బాబాయి, మామయ్య దగ్గరగా వచ్చి భుజం తట్టారు ఓదార్పుగా!

నాయనా! రమణమూర్తి ఇక నీకు తో విన దానం, దక్షిణ ఇప్పిస్తే నేను శెలవు తీసుకుంటాను అంటూ వచ్చారు పంతులుగారు

"దానాలు ఏం ఇవ్వగలం చెప్పండి ఇదిగో, దక్షిణ " అంటూ పన్నెండు రూపాయలు చేతిలో పెట్టాడు

ఏమిటి! పన్నెండు రూపాయిలా! శివశివా! ఎంత దుర్దినాలు పూర్వపు రోజుల్లో అయితే ద్వాదశ దానాలుండేవట అంటే ఏమిటో తెల్సా! సువర్ణం దానం చేస్తే సూర్యలోక ప్రాప్తి! వెండి అయితే చంద్రలోకం, కంచు, దాసి దానం చేస్తే కుబేరయోగం, భూదానం చేస్తే మరుజన్మలో చక్రవర్తి జననం, కన్యదానం సుపుత్ర ప్రాప్తి ఇలా దానా లుండేవి అయినా ఈ రోజుల్లో పది రూపాయలు చేతిలో పెట్టి అన్నీ అవే అనుకోండి అంటున్నారు సరే, కాలంతో పాటు మనమూ నడవాలి తప్పదుగా! మూర్తీ, కృష్ణలో మూడుసార్లు మునిగి, అనక ఇంటికి వెళ్ళు" అంటూ పప్పులు, పుప్పులు అవీ తీసుకుని లేచి నాలుగడుగులు వేశాడు

రమణమూర్తి కండువా సవరించుకుంటూ సాలోచనగా వెనక నుంచి పంతులుగార్ని చూసి, ఉలిక్కి పడ్డాడు అతని కుడి భుజం మీద పెద్ద పుట్టుమచ్చ

మరునిముషం తేరుకుని వేగంగా అడుగులు వేసి అతన్ని సమీపించి భుజం మీద చెయ్యివేసి తన వైపు తిప్పుకున్నాడు

'నువ్వు సారథివి కదూ!" అన్నాడు

"అవును. ఇప్పటికి గుర్తు పట్టావన్న మాట" అన్నాడు నవ్వుతూ

'అదేమిట్రా నువ్వేమిటి? ఇలా బ్రాహ్మడిలా మంత్రాల వ్యాపారం ఏమిటి?' అన్నాడు విస్తుపోతూ రమణమూర్తి

"బ్రతుకు తెరువు కోసం! డిగ్రీ పూర్తయి పదేళ్ళు

# ఈల వేస్తే పలికే తాళాల గుత్తి!

తాళాలు ఒక చోట పెట్టి మిగతా అన్నిచోట్ల వెతకే మతి మరుపు మందభాగ్యుల కోసం పశ్చిమజర్మనీలోని ఒక సంస్థ ఒక చిన్న తాళాల సంచిని తయారు చేసింది. ఈల వేస్తే చాలు ఈ సంచి పది మీటర్ల లోపు ఎక్కడ వున్నా పలుకుతుంది చిక్కు ఇట్టే విడిపోతుంది దీనిని తయారు చేసిన సంస్థ పేర్లు "ఇంసెక్స్" "ఎలక్ట్రానిక్స్ దీని ఖరీదు రు 800 ల నుండి రు 1200ల వరకు ఉంటుంది

(గ్లోబల్)

# అబ్దికం

కావస్తుంది ఉద్యోగం లేదు కన్నవాళ్ళ మాట పడలేక, వారికి భారం కాలేక ఇంట్లోంచి బయటకు వచ్చేశాను ఎన్నో పనులు చేశాను, కాఫీ హోటల్లో కప్పులు కడగటం నుంచి రాళ్ళెత్తడం వరకూ అన్నీ అయిపోయాయి ' ఈ జానెడు పొట్ట కోసం ఎందుకింత తపనో అర్థం కాదు

అందుకే ఏదో ఒక వృత్తి ఉపాధికోసం అలవాటు చేసుకోవాలని తీవ్రంగా ఆలోచించి. చివరికి ఇందులో దిగాను' అన్నాడు సారథి

అలా అంటున్నప్పుడు సారథి కళ్ళల్లో తడి మెరవటం రమణమూర్తి గమనించక పోలేదు అయినా అన్నాడు, 'సారథీ' బ్రతుకు తెరువు కోసం ఈ వృత్తే దొరికిందిట్రా నీకు ఈ వృత్తి తప్పని కాదు నేననేది అసలు మంత్రాలు, ఆచారాలూ వీటి పట్ల నువ్వు బద్ధ వ్యతిరేకివి కదా! అందు కంటున్నాను' అన్నాడతను

జీవం లేని నవ్వు నవ్వాడు సారథి

'ఏ ప్రవేట్ కంపెనీల్లో ప్యూన్‌గానో, మరొకటేదైనా చేయచ్చు అడ్డమైన చాకిరీ చేయించుకుని వాళ్ళిచ్చే నాలుగైదు వందల్తో సంసారాన్ని ఈదటం నావల్ల కాదు

అతిథి మర్యాదల కోసం, పరువు ప్రతిష్టల కోసం ప్రాకులాడుతూ వాటి చాలని జీతాలతో నానా కష్టాలు పడే నీలాంటి మధ్య తరగతి మనుషులు, కోకొల్లలు మన దేశంలో వీళ్ళున్నంత కాలం నా ఈ బ్రాహ్మణత్వానికేం ఢోకాలేదని పించింది

బ్రతుకు తెరువు అంటూ నా ప్రవర్తనని సమర్థించుకోడం లేదురా మూర్తీ! ఇప్పటికీ నాకి మంత్ర తంత్రాల మీద నమ్మకం లేదు దుఃఖంతో ఇక్కడికి వచ్చేవారిని నాకొచ్చిన నాలుగు మంత్రాలు చదివి కార్యక్రమం నిర్వహించి పంపేస్తాను

మూర్తీ! నువ్విలా అప్పులపాలై ఘనంగా అబ్దికం నిర్వహించటం వల్ల నీ తండ్రి ఆత్మ శాంతిస్తుందనుకోడం భ్రమరా! చనిపోయిన మనిషి కోసం మనసంతటితోటి రెండు కన్నీటి బొట్లు కురిపిస్తే అందువల్ల దొరికే శాంతి మరి దేనివల్లా లభ్యంకాదు ఇది నా పాలసీ" అంటూ ఆగాడు సారథి

రమణమూర్తి అవాక్కయి విన్నాడు అతని మాటలు మంత్రంలా పని చేస్తున్నాయి

జటిలో ముండి, లుంభిత కేశీ
కాషాయాంబర, బహుకృత వేషం,
పశ్యన్నపిచ. నరుస్యతి, మూఢో
ఉదర నిమిత్తం, బహుకృత వేషం

అంటే " అర్థం కానట్టు చూశాడు సారథిని

"అంటేనా! పొట్ట కోసం పుట్టిడు వేషాలు అని చివరి పదానికి అర్థం ముందు వాటి అర్థం నాకూ తెలీదు అన్నాడు

అంత బాధ, బరువులోనూ నవ్వొచ్చింది రమణమూర్తికి

మరి నే వస్తాను మూర్తీ! అన్నట్టు నా విషయం మీ బాబాయి వాళ్ళకు చెప్పకు వారి ఆత్మ గగ్గోలు పెట్టేస్తుంది సారీరా! వస్తాను" అంటూ గమ్యస్థానం లేని జలపాతంలా సాగిపోతున్న సారథిని కన్నీటి పొరల మధ్య చూస్తూ నిలబడి పోయాడు రమణమూర్తి □




